క్లుప్తంగా

శ్రీదేవీతల్లి ఆలయ నిర్మాణానికి విరాళాలు



ఆలయ కమిటీ చైర్మన్ అప్పలనాయుడుకు విరాళం అందిస్తున్న సుధాకర్, పైడిరాజు

మునగపాక: ఉమ్మలాడలో నిర్మిస్తున్న శ్రీదేవీ తల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. విజయదశమి సందర్భంగా గ్రామానికి చెందిన పల్లి సుధాకర్, పల్లి పైడిరాజు సోదరులు రూ.66,666 నగదును ఆలయ కమిటీ చైర్మన్ పల్లి అప్పలనాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

నేడు పల్లె పండగ

కోటవురట్ల: మండలంలోని మూడు గ్రామాల్లో సోమవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. కోటవురట్లలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, కైలాసపట్నంలో ఉయదం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తంగేడులో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు సీతారామరాజు

ఎస్.రాయవరం: ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉండి సమాజ నవ నిర్మాణ ప్రదాతలు కావాలని ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లపరాజు సీతారామరాజు అన్నారు. మండలంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓట్ల నమోదు కార్యక్రమం ప్రారంభించారు. అర్హులంతా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కర్త చోడిశెట్టి సత్యనారాయణ, పీఆర్‌టీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా కర్ర పెండలం పంట సాగు



గరుగుబిల్లిలో సాగులో ఉన్న కర్ర పెండలం పంట

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో ఖరీఫ్ సాగులో భాగంగా కర్రపెండలం పంటను విస్తారంగా రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఈ పంటను మెట్ట ప్రాంత గ్రామాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, డి.అగ్రహారం, ఆర్లి, పింద్రంగి గ్రామాల్లో 80 ఎకరాలలో సాగుచేస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాలలో గల భూములు ఈ పంటకు అనుకూలంగా ఉండనుండడంతో కర్రపెండలం దుంపలు దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేస్తాయన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న కర్ర పెండలం సాగు కోత దశకు చేరుకుందని సాగు రైతులు తెలుపుతున్నారు.

రూ.35 వేలకు లడ్డూ దక్కించుకున్న సర్పంచ్

మాకవరపాలెం: దుర్గమ్మ మండపంలో పూజలందుకున్న లడ్డూను బూరుగుపాలెం సర్పంచ్ బొబ్బలరెడ్డి వెంకటరమణ రూ.35 వేలకు దక్కించుకున్నారు. ఈ గ్రామంలో శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గమ్మ మండపం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తొమ్మిది రోజులపాటు పూజల అనంతరం శనివారం రాత్రి లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో సర్పంచ్ వెంకటరమణ రూ.35 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. కాగా మండలంలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నవరాత్రులు ముగియడంతో వైభవంగా ఊరేగింపు చేసి నిమజ్జనం చేశారు. తూటిపాలలో కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



తిమ్మరాజుపేటలో అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తులు



మునగపాకలో దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపులో గ్రామస్తులు



నక్కపల్లి టీచర్స్ కాలనీలో నవదుర్గా పూజ నిర్వహిస్తున్న మహిళలు



మునగపాకలో ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శన

దుర్గమ్మా.. శరణు శరణు

- అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



కాగితలో రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు



యలమంచిలి గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో అమ్మవారు



మునగపాకలో ఆకట్టుకున్న శూలాల ప్రదర్శన

నక్కపల్లి: అమ్మలగన్న అమ్మకు భక్తులు నీరాజనం పలికారు. శక్తిరూపిణిని మనసారా కొలిచి తన్మయత్వం పొందారు. విజయదశమి పర్వదినాన్ని శనివారం వాడవాడలా ప్రజానీకం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువజాము నుంచి దుర్గాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దుర్గాదేవి మండపాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కాగిత, ఉద్దండపురం, నక్కపల్లి, ఉపమాక, తదితర గ్రామాల్లో ఉన్న దుర్గాదేవి ఆలయాల వద్ద దశమి పూజలు నిర్వహించారు. నక్కపల్లి టీచర్స్ కాలనీలో వేద పండితుడు శ్రీపాద సత్యభాస్కరప్రసాద్ ఇంటి ఆవరణలో ప్రత్యేకంగా అమ్మవారిని నెలకొల్పి నవదుర్గలకు పూజలు చేశారు. చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో ధర్మకర్త శ్రీపాద సత్యదేవ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఊరేగింపు నిర్వహించారు. కాగితలో దుర్గాదేవిని రాజరాజేశ్వరి అమ్మవారిగా అలంకరించారు. మహిళలంతా సామూహిక హారతి ఇచ్చారు. పలువురు కొత్త వాహనాలను కొనుగోలు చేసి పూజలు చేశారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న ఆండాళ్లమ్మవారి సన్నిధిలో లక్ష్మీసహస్ర నామ అష్టోత్తర శతనామార్చన జరిపారు. భవానీ దీక్ష చేపట్టిన భక్తులు ఇరుముడి కట్టుకుని మొక్కు చెల్లించుకునేందుకు విజయవాడ బయలు దేరారు.



వెంకటాపురంలో దుర్గాదేవి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



పెంజెరువు కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా దసరా పండగ

కోటవురట్ల: దసరా పండగను మండలంలో శనివారం ఘనంగా జరుపుకొన్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగియడంతో పలు గ్రామాలలో అమ్మవారి విగ్రహాలను భారీ ర్యాలీతో ఊరేగించి నిమజ్జనం చేశారు. కై లాసపట్నంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి దర్శించుకున్నారు. జల్లూరులో కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. పాములవాకలో భవానీమాలధారులు చండీ హోమం, శమీ పూజ చేశారు. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, గ్రామస్తులు, పాల్గొన్నారు. కైలాసపట్నంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ, డీవీ యువసేన గౌరవ అధ్యక్షుడు డి.బి.వి.రాజగోపాలరాజు, మాజీ సర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పెన్నాడ రాంబాబు, డీవీ రావు, చామంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మునగపాక: మండల వ్యాప్తంగా దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. పలు చోట్ల అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మునగపాక రామాలయం వద్ద గౌరీ పీఠం ఆధ్వర్యంలో శూలాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పలువురు భక్తులు బుగ్గ, నాలుక శూలాలు ధరించి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మాలలు ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలను తిలకించారు. మునగపాక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు అలంకరించారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. హరిపాలెం-అందలాపల్లిలోని భగీరథమ్మ ఆలయం కమిటీ ఆధ్వర్యంలో శూలాల ప్రదర్శన, అగ్నిగుండం ప్రవేశాలు భక్తిశ్రద్ధలతో జరిపారు. హిమగిరి కొండపై వెలసిన విజయదుర్గ అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు శూలాలు ధరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా కమిటీ చైర్మన్ మారిశెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ ఏర్పాట్లు చేశారు. తిమ్మరాజుపేటలో జగ్గారావు మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపు, శూలాల ప్రదర్శన నిర్వహించారు.

మునగపాక: దసరా సందర్భంగా మునగపాక నందీశ్వర కళా వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దివంగత పెంటకోట సత్యనారాయణ, పెంటకోట పట్టాభిరామునాయుడు(గాంధీ) జ్ఞాపకార్థం ఎన్ఆర్ఐ పెంటకోట శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం తప్పెటగుళ్ల, కోలాటం ప్రదర్శనలతో పాటు పిల్లలకు రంగులరాట్నం, జంపింగ్ వంటి క్రీడలు నిర్వహించారు. కొండకర్లకు చెందిన తప్పెటగుళ్ల కళాకారులు, మునగపాక ఇందిరమ్మ కాలనీకి చెందిన కోలాటం కళాకారులు తమ ప్రదర్శనతో అలరించారు. పెంటకోట సత్యనారాయణ, గాంధీల చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, తదితరులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సూరిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సూరిశెట్టి సుధారాణి, విద్యుత్ శాఖ ఏఈ వినోద్, తోటాడ పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, సత్యనారాయణ, గాంధీ కుటుంబ సభ్యులతో పాటు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామంలో కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో వాహనాలు, పలు యంత్రాలకు పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

యలమంచిలి రూరల్: దసరా సంబరాలను యలమంచిలి పట్టణం, మండల వాసులు వైభవంగా జరుపుకొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు శనివారం విజయదశమి సందర్భంగా దుర్గామాతను రాజరాజేశ్వరిగా అలంకరించారు. పెంజెరువు దుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు 10వేల మందికిపైగా భక్తులు ఇక్కడ ఆలయానికి వచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి చీర, జాకెట్టు, గాజులు, నల్ల పూసలు, పసుపు, కుంకుమలు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, తాగునీరు అందజేశారు. అమ్మవారిని బంగారు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గాంధీనగరం గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞాన పీఠంలో నవరాత్రి వేడుకలు స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దిమిలిరోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దసరా సందర్భంగా పలువురు జమ్మిచెట్టుకు పూజలు చేశారు. భవానీ మాల ధరించిన భక్తులు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి తరలి వెళ్లడంతో బస్సులు, రైళ్లు రద్దీగా మారాయి.



యలమంచిలి పెంజెరువు కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



తిమ్మరాజుపేటలో ఘటాల ఊరేగింపు



కోనవానిపాలెంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

ఎస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు ,ఎస్.రాయవరం, పి.ధర్మవరం, రామయ్యపట్నం, కొరుప్రోలు, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, దార్లపూడి తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి అనుపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. కోనవానిపాలెం గ్రామంలో అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు దర్శించుకున్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని బృందావనంలో కొలువుదీరిన దుర్గాలమ్మ చెట్టు ఆలయం, దుర్గాకాలనీ, బైపాస్ సెంటర్‌లో ఉన్న దుర్గాంబిక ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. రాజగోపాలపురం, అరట్లకోట, ఒడ్డిమెట్టలోని అమ్మవారి ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజాలు నిర్వహించారు.



ఇరుముడికట్టుకుని విజయవాడ బయలుదేరిన భవానీ భక్తులు



కైలాసపట్నంలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



జల్లూరులో భవానీ భక్తుల ర్యాలీ



పాములవాకలో చండీ హోమం చేస్తున్న భవానీభక్తులు



హరిపాలెంలో దుర్గాదేవి వేషధారణలో భక్తురాలు



మునగపాకలో శూలం ధరించిన భక్తుడు



కాగితలో వాహనాలకు పూజలు చేస్తున్న భక్తులు



మునగపాకలో తప్పెటగుళ్ల ప్రదర్శన

ఆనాటి స్నేహ మధురం..



సమావేశమైన 1995-2000 మధ్య విద్యనభ్యసించిన విద్యార్థులు

కోటవురట్ల: చిన్నతనం నుంచి కలిసి చదువుకుని, ఎవరికివారే వేర్వై ఎక్కడెక్కడో సెటిలై మళ్లీ కలుసుకుంటే ఆ మజాయే వేరు. పదో తరగతి వరకు కలసిమెలసి చదువుతూ, చిలిపి చేష్టలతో గురువుల బెత్తం దెబ్బలు తింటూ గడిపిన ఆ రోజుల మధుర స్మృతులు, ఆ స్నేహ బంధం జీవితాంతం పెనువేసుకునే ఉంటుంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-2000 మధ్య విద్యను అభ్యసించిన అప్పటి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఆనాటి తీపి గురుతులను స్మరణకు తెచ్చుకుని ఒకరినొకరు పరిచయం చేసుకుని సంతోషంగా గడిపారు. తమ ఉన్నతికి కారణమైన గురువులను సముచితరీతిలో సత్కరించి ప్రణమిల్లారు. సహపంక్తి భోజనం చేసి ఆటపాటలతో ఉత్సాహంగా కాలక్షేపం చేశారు. మళ్లీ కలుసుకుందామంటూ భారంగా వీడ్కోలు పలికారు.

ఘనంగా అంతర్జాతీయ పాస్టర్స్ డే



పాస్టర్ పరమానందాన్ని సత్కరిస్తున్న సంఘస్తులు

కోటవురట్ల: మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం అంతర్జాతీయ పాస్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఏసుక్రీస్తు బోధనలను వివరించారు. రాట్నాలపాలెంలోని బెతస్థా ప్రార్థన మందిరంలో పాస్టర్ పరమానందాన్ని సంఘస్తులు ఘనంగా సత్కరించారు. సంఘాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దిన ఘనత పరమానందానికి దక్కుతుందని పలువురు కొనియాడారు.

జనవరిలో శ్రీనివాస కల్యాణం

- టీటీడీ పండితులతో నాతవరంలో నిర్వహణకు ఏర్పాట్లు
- పోస్టర్ విడుదల



శ్రీనివాస కల్యాణం పోస్టరు విడుదల చేస్తున్న మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు, కమిటీ సభ్యులు

నాతవరం : మండల కేంద్రంలో సంక్రాంతికి తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులతో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నామని ఎన్ఆర్ఐ శెట్టి శతీష్ తెలిపారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను విజయదశమి పండగ సందర్భంగా శ్రీశక్తి పంచాయతన ఆలయంలో మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయకుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ విడుదల చేశారు. ఉత్సవ వివరాలు వెల్లడించారు. జనవరి 10వ తేదీన శ్రీవారి ఆనంద నిలయంలో ఉత్తర ద్వార దర్శనం, 11న సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకు తిరుపతిలో స్వామి వారికి ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే అన్ని రకాలు సేవలు ఇక్కడి భక్తులకు కళ్లకు కట్టినట్టుగా తిరుమల వేద పాఠశాల అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఇంతవరకు మండలంలో ఎక్కడ కూడా శ్రీనివాస కళ్యాణం జరగలేదన్నారు. శ్రీనివాస కల్యాణంలో పూజ చేయించుకునే భక్తులు ముందుగా ఆలయం వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, శ్రీశక్తి పంచాయతన ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

18 మద్యం షాపులకు 366 దరఖాస్తులు

పాయకరావుపేట: పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంజూరైన 18 మద్యం షాపులకు 366 దరఖాస్తులు వచ్చాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్.రాయవరం మండలంలో ఏడు షాపులకు 126 దరఖాస్తులు, నక్కపల్లి మండంలో 5 షాపులకు 107 దరఖాస్తులు, పాయకరావుపేట మండలంలో 6 వైన్ షాపులకు 133 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆఫ్‌లైన్‌లో 330, ఆన్‌లైన్‌లో 36 దరఖాస్తులు అందాయన్నారు. ఈ వైన్ షాపులను దక్కించుకునేందుకు ఒక్కో దరఖాస్తుదారుడు రూ.2 లక్షల చొప్పున డిపాజిట్ చెల్లించారని చెప్పారు. ప్రభుత్వానికి రూ.7.32 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. 2024-26 కాల పరిమితి కోసం మంజూరైన ఈ వైన్ షాపుల దరఖాస్తుదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 14న అనకాపల్లి గవరపాలెంలోని నూకాలమ్మ గుడి రోడ్డులోని సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాలులో ఉదయం 8 గంటల నుంచి ఉన్నతాధికారుల సమక్షంలో లాటరీ తీసి షాపులు కేటాయిస్తామని చెప్పారు. దరఖాస్తుదారులకు ఎంట్రీ పాసులు అందజేశామన్నారు. ఇతరులకు ప్రవేశం లేదని, ఒకవేళ దరఖాస్తుదారుడు రాలేని పక్షంలో ఆథరైజేషన్ లెటర్ తీసుకుని వస్తే అనుమతిస్తామని సీఐ తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేవతి ప్రతిభ



రేవతి

అనకాపల్లి: దేవరాపల్లి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన అల్లు రేవతి జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో యూత్ జూనియర్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మాల వెంకటరామ ఆమెను అభినందించారు. హిమాచల్‌ప్రదేశ్ నగ్రోటా బగ్వాన్ జిల్లాలో యూత్ జూనియర్, సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకూ జరిగాయని, ఈ పోటీల్లో రాష్ట్రం తరఫున యూత్ జూనియర్ విభాగంలో ఎ.రేవతి పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమని గుమ్మాల అన్నారు.